www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 31 జులై 2024 5 కాకినాడ

విఒఎ ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నికైంది. మంగళవారం స్థానిక లక్ష్మీదాస్ భవన్‌లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా జి.బేబీరాణి, జిల్లా అధ్యక్షురాలుగా గంగాభవాని, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరిబాయి, కోశాధికారిగా జి.మేరీ, ఉపాధ్యక్షులుగా బి.అనంతలక్ష్మి, ఈశ్వరి, కె.సత్తివేణి, డి.మేరీ, సహాయ కార్యదర్శులుగా టి.రాణి, ఆర్.శ్యామల, అమ్మణి, వి.చిన్నితల్లి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ రాజకీయ కారణాలతో యానిమేటర్లపై వేధింపులు పెరుగుతున్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో తొలగింపులకు సిద్ధపడుతున్నారని, యానిమేటర్లు అంతా భవిష్యత్ పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా.?

- ఇష్టారాజ్యంగా వినియోగం
- అడ్డూ అదుపు లేకుండా అమ్మకాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల్ని ఎక్కడ అమ్మకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అమ్మకాలు జరిపుతూ పట్టుబడితే వారి కమర్షియల్ లైసెన్సులను రద్దు చేసే అవకాశం ఉంది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ సంచులను సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌గా పరిగణిస్తారు. అంటే రోజూ మనం వాడి పారేసే స్ట్రాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ సంచులు, సోడా బాటిళ్లు, ప్లేట్లు, కప్పులు, ఆహారం ప్యాకేజ్ కంటెయినర్లు, ఇయర్ బడ్ విత్ ప్లాస్టిక్ స్టిక్స్, సిగరెట్ ఫిల్టర్స్ లాలీపాప్, చాక్లెట్లకు వాడే ప్లాస్టిక్ పుల్లలు, ఐస్‌క్రీమ్ స్టిక్స్, థర్మోకోల్, 100 మైక్రాన్ల లోపు మందం గల పివిసి బ్యానర్లు, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డులు తదితర ప్లాస్టిక్ వస్తువుల్ని ఈ జాబితాలోకి వస్తాయి.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ భూతం

స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి కార్యక్రమాలు జిల్లాలో నగరాలు, మున్సిపాలిటీల్లో అమలవుతున్నా విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతుంది. కాకినాడ జిల్లాలో అన్ని పంచాయతీల్లో రోజుకి సుమారు 16 టన్నులు, పట్టణాలు, నగరాల్లో అయితే దాదాపు 70 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి జరుగుతుంది. దాంతో ప్రజారోగ్యం దెబ్బతింటుంది. జిల్లా కేంద్రం కాకినాడ స్మార్ట్ సిటీలో 50 డివిజన్లలో సుమారు 4 లక్షల 50 వేల మంది జనాభా ఉండగా ఇక్కడ అనేక మంది వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లలో చెత్తను నింపి రోడ్లపై వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్‌ను ఎక్కువగా వాడుతున్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ దాదాపు 4 లక్షలకుపైగా ప్లాస్టిక్ కవర్లు, ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఒక రోజులో వినియోగమయ్యే అవకాశం ఉంది. ఇవన్నీ మరుసటి రోజుకు చెత్తగా మారి డ్రెయినేజీలోకి చేరి కాలుష్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అధికారులు ఇటీవల కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులపై కొరడా ఝుళిపిస్తున్నా ఫలితం నామమాత్రంగానే ఉంటుంది.

అధికారుల చర్యలు శూన్యం

పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లో భాగంగా ప్లాస్టిక్ ఉత్పత్తులు, వినియోగంపై జిల్లాలో పలు చోట్ల నిషేధాజ్ఞలు జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అధికారులు కొంత కాలంపాటు అవగాహన కల్పించారు. అమ్మకాలపై మొదట్లో కొరడా ఝుళిపించారు. ఆ తర్వాత నిషేధంపై అధికారులు అంతగా పట్టించుకోకుండా వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలు, ప్రచారానికి మాత్రమే పరిమితమైనట్లు కనిపిస్తుంది. ఎక్కడికక్కడ యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచులను విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారు. చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలతో పాటు అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో అధికార యంత్రాంగం నిషేధ ఆంక్షలను అమల్లోకి తీసుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న వ్యాపారులకు భారీగా జరిమానా విధించడానికి సైతం వెనుకాడమని, వరుసగా రెండు సార్లు పట్టుబడిన దుకాణాలను సీజ్ చేస్తామని కూడా చెప్పుకొస్తున్నారు. కానీ ఆచరణలో అనేక చోట్ల ప్లాస్టిక్ వినియోగం యథావిధిగా జరిగిపోతుంది. కానీ అధికారుల చర్యలు ఎక్కడా కానరావడం లేదు.

కేంద్ర బడ్జెట్ కేటాయింపుల పై నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

సామాన్యులపై భారాలు వేస్తూ, దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచిపెట్టేలా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయంటూ సిపిఎం నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జీ, జి.బేబిరాణి, నాయకులు కె.సత్తి రాజు, ట్రేడ్ యూనియన్ నేత సిహెచ్.రాజ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు వేసేలా ఉందని విమర్శంచారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి, పట్టణాల్లో కూడా ఉపాధి పథకం ప్రారంభించాలని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను పక్కన పెట్టి 500 లిస్టెడ్ కంపెనీలకు ఉపాధి కల్పన పేరుతో ప్రజల సొమ్ము దారాదత్తం చేసే స్కీం ప్రకటించిందని అన్నారు. ధరల నియంత్రణకు, ఆహార భద్రతకు ఈ బడ్జెట్ తిలోదకాలు ఇచ్చిందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనివిధంగా తాండ విస్తుంటే బిజెపి పాలకుల చర్యలు నిరుద్యోగాన్ని మరింత పెంచేవిగా ఉన్నాయన్నారు. ఈ బడ్జెట్ లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టం హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. రాజధాని నిర్మాణానికి అప్పు రూపంలో రూ.15 వేల కోట్లు ప్రకటించడం ద్వారా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. టిడిపి, జనసేన ఎంపీలు పార్లమెంటులో రాష్ట్ర ప్రజల వాణిని వినిపించి, ప్రత్యేక హోదా సాధించడానికి చిత్త శుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.సత్తిబాబు, సూరిబాబు, చంద్ర మళ్ళ పద్మ, నర్ల ఈశ్వరి, డి.క్రాంతికుమార్, ఆర్. ఈశ్వరరావు, మేడిశెట్టి వెంకటరమణ, అనపర్తి ఏడు కొండలు, ఎం.రవి, తలుపులమ్మ, రాణి, వాసు, ఎస్.కె.పద్మ, ఎన్.సూర్యనారాయణ, సంజయ్ పాల్గొన్నారు.

217 రద్దుపై మత్స్యకారుల హర్షం

బాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మత్స్యకారుల జీవనానికి తూట్లు పొడిచేలా గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 217ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో బిసి సెల్ నాయకులు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేష్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ సాంప్రదాయ వేట, మేకనైజ్డ్ బోట్ల ద్వారా వేట చేసే మత్స్యకారులు, మత్స్యకార సొసైటీలకు నష్ట చేకూర్చేలా వైసిపి ప్రభుత్వం జిఒ నెంబర్ 217ను తీసుకొచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆ జిఒను రద్దు చేయడం ద్వారా మత్స్యకారులకు ఎంతో మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కామాడి మాతరాజు హర్షం వ్యక్తం చేశారు. పొన్నమండ రామలక్ష్మి, పెసింగి ఈశ్వరరావు, వంగా త్రిమూర్తులు, మల్లాడి వరదరాజు పాల్గొన్నారు.

సిఎస్‌ఆర్ నిధులతో కెనాల్ ప్రాంత అభివృద్ధి

ప్రజాశక్తి - కాకినాడ

కొబ్బరి బొండాల వ్యర్థాలు, చెత్తా చెదారంతో అపరిశుభ్రతకు నిలయంగా మారిన సామర్లకోట కెనాల్‌కు ఇరువైపులా సిఎస్‌ఆర్ నిధులతో సుందరీకరణ చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భావన వెల్లడించారు. మంగళవారం ఆమె ప్రతాప్ నగర్ బ్రిడ్జి నుంచి ఇంద్రపాలెం వంతెన వరకూ క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుమారు 1.5 కిలోమీటర్ల పరిధిలో కెనాల్ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సిఎస్‌ఆర్ నిధులతో ఈ ప్రాంత సుందరీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు డైరీ ఫారం ప్రాంతంలో ప్రతిపాదించిన అన్న క్యాంటీన్ పనుల ప్రగతిని కమిషనర్ పరిశీలించారు. వచ్చే నెల ఐదో తేదీ నాటికల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆగస్టు 15 నుంచి అన్నా క్యాంటీన్లను వినియోగంలోకి తేవాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో పనులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. చీడీల పొరడ్రైన్ సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి చెత్త సేకరణ, తడి పొడి చెత్త సేకరణ విషయంలో పారిశుధ్య కార్మికులు మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, ఎంహెచ్ఒ డాక్టర్ పృధ్వీచరణ్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్ భావన

లైన్‌మేన్ సాహసం..

ప్రజాశక్తి - రౌతులపూడి

తుపాను ప్రభావంతో విద్యుత్ లైన్‌పై పడిన చెట్టును తొలగించి, విద్యుత్‌ను పునరు ద్ధరించేందుకు లైన్‌మేన్ ప్రాణాన్ని ఫణంగా పెటేలా సాహసం చేశాడు. వివరాల్లోకి వెళ్లి తే...రౌతులపూడి గ్రామ శివారున తుపాన్ ప్రభావంతో విద్యుత్ లైన్‌పై ఒక చెట్టు పడి పోయింది. దీంతో 19 గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ నిలిచిపో యింది. ఆ చెట్టును తొలగిం చాలంటే మధ్యలో ఏటి కాలువను దాటి వెళ్లాలి. వర్షాలతో ఆ ఏటి కాలువ ఉధృతంగా ప్రవహి స్తోంది. చేసేది లేక ఎపిఇపిడిసిఎల్ లైన్‌మేన్ కారం సత్తిబాబు తన ప్రాణాలను ఫణంగా పెట్టి విద్యుత్ తీగలను ఆధారంగా చేసుకుని తీగలపై పాకుతూ అవతలకు వెళ్లి లైన్‌పై పడిన చెట్టును తొలగించి విద్యుత్ పునరుద్ధరణకు పాటుపడి అందరితో శభాష్ అనిపించుకున్నాడు. ప్రస్తుతం ఏటి కాలువను దాటేందుకు విద్యుత్ లైన్ తీగలపై వెళ్తున్న లైన్‌మేన్ సాహస వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

వైర్ల సాయంతో కాలువను దాటుతున్న లైన్‌మేన్

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గాన్ని అభి వృద్ధి పథంలో నడిపిస్తానని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళ వారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉపాధి హామీ పథకం కంపోడెంట్ నిధులు రూ.2 వేల కోట్లను గత ప్రభుత్వం వినియోగించుకోలేదని, ఆ నిధులను కూటమి ప్రభుత్వం రాబట్టిందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.150 కోట్లతో సిసి రోడ్డు, డ్రెయిన్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. జగ్గంపేట పంచాయతీకి రూ.10 కోట్లు, గోకవరం పంచాయతీకి రూ.10 కోట్ల నిధులు వెచ్చించి అభి వృద్ధి చేస్తానని చెప్పారు. గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కూటమి నాయకులు ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు జీను మణిబాబు, భద్రం, చదరం చంటిబాబు, శ్రీను పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఎల్‌ఎ నానాజీ

ప్రజాశక్తి - కరప

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకార్యాలను కల్పిస్తున్నట్లు ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దాపురప్పాడులోని బిరుదా ఫకీర్ రావు జడ్‌పి ఉన్నత పాఠశాలలో శుభదిన్ శుభతిథి భోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ పథకంలో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎలియన్స్ క్లబ్ మెంబర్స్ ట్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థులకు మేమెంటోలు, నగదు ప్రోత్సాహాన్ని ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో పంతం సందీప్, తూము బన్ను , పబ్బినేడి పద్మావతి, బిరుద శ్రీనివాస అప్పారావు, ఉపవిద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, ఎంఇఒ బుల్లికృష్ణవేణి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటన చేసిన కమిషనర్

సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ రామారావు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని పలు వార్డుల్లో కమిషనర్ జె.రామా రావు క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. మంగళవారం మార్నింగ్ వాక్ పేరుతో కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బంది పనితీరును, వార్డుల్లో పారిశుధ్య ఇబ్బందులను పరిశీలిం చారు. హెూటళ్ళు, టీ దుకాణాలను సందర్శించి ప్లాస్టిక్ వినియో గంపై తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన గ్రేడ్ మినహా కవర్లు ఉపయోగించ వద్దని వ్యాపారులను ఆదేశించారు. అలాగే టీ దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులు వాడకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. చందలాడ గురువులోని కరప చెరువు గట్టును పరిశీలించారు. ఈ పర్యటనలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.అప్పలకొండ, కూటమి నాయకులు బి.శ్రీకాంత్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

పెద్దాపురప్పాడు గ్రామంలో డాక్టర్ మారెళ్ళ స్టీఫెన్ ఆనంద్ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి, రే ఆప్టిక్స్, క్లోవ్ డెంట ల్ సహకారంతో కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కళ్ళ జోళ్ళు అవసరమైన వారికి కళ్ళజోడు ఫ్రేములు ఉచితంగా అందజేశారు. పముఖ కంటి వైద్యులు డాక్టర్ తిరుమలశెట్టి అరుణ, సీనియర్ ఆప్టోమెట్రిస్ట్, దంత వైద్యులు డాక్టర్ ఆనెం చైతన్య బృందం వైద్య సేవలు అందించారు. ఈ శిబిరాన్ని వీరబాబు, టి.సుష్మ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, ఎంపిటిసి సభ్యులు పబ్బినీడి ప్రసాద్, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాద్, ఎం.చంద్రశేఖర్, జి.రామస్వామి పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రతి పంటకు సకాలంలో సాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం ఆయన పుష్కర కాలువ ద్వారా సాగునీటి సరఫరా ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు, పుష్కర, పోలవరం కాలువల ద్వారా మెట్ట రైతంగానికి రెండు పంటలకు నీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.సూర్యప్రకాశరావు, కూటమి నాయకులు ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట శివారు గొప్పవరం, జొన్నలదొడ్డి ప్రాథమిక పాఠశాలలు, వేట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలను ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య పరిశీలించారు. తొలుత విద్యార్థుల చదువు, రాత నైపుణ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించి మరింత రుచికరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయా హెచ్‌ఎంలను ఆదేశించారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక హార్వెస్ట్ స్కూల్‌లో మండల న్యాయశాఖ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ అడ్వకేట్స్ కె.నూకరాజు, డి.బ్రహ్మాజీ పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల్ని, పిల్లల్ని దొంగలించే నేరగాళ్లు ఉన్నారని, మనకు తెలియని వ్యక్తుల్ని నమ్మరాదన్నారు. చదువుతున్న విద్యార్థులు ఇలాంటి విషయాలపై అవగాహన కలిగి ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్లు సత్యమోహన్ రెడ్డి, సత్యానంద రెడ్డి ప్రిన్సిపల్ అనిల్ రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఠాపురంలో నాన్‌స్టాప్ బస్సులకు హాల్ట్

ప్రజాశక్తి - పిఠాపురం

హాల్ట్ స్టేజ్ వద్ద బస్సును ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

పట్టణంలోని స్థానిక పాదగయ జంక్షన్ వద్ద నాన్ స్టాప్ బస్సులకు హాల్టును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆర్‌టిసి డిపో మేనేజర్ మనోహర్ మాట్లా డుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు లాంగ్ డిస్టెన్స్ సర్వీస్‌లకు బోర్డింగ్ స్టేజ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అటు విశాఖపట్నం వైపు వెళ్లేవారు, అటునుంచి వచ్చే వారు సదరు బోర్డింగ్ స్టేజిని వినియోగించుకోవ చ్చన్నారు. సామర్లకోట నుంచి పిఠాపురం వచ్చే బస్సులు ఉప్పాడ బస్టాండ్ వరకు మాత్రమే వచ్చే వని, ఇకమీదట ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు సర్వీ సులు పొడిగిస్తున్నామన్నారు. పిఠాపురం కాంప్లె క్స్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నామని ప్రయాణికుల అవసరాల రీత్యా మరిన్ని సర్వీస్‌లు పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి, నాయకులు ఎస్. సురేష్, రంగబాబు ఎం.శ్రీనివాసు, ఎ.ప్రభాకర్, వరలక్ష్మి, శేఖర్, బాబీ, బి.అనిల్, కమల పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి -పెద్దాపురం

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నేడు జరగనున్నట్లు కమిషనర్ కెవి.పద్మావతి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అయ్యే సమావేశానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో 32 అంశాలతో కూడిన ఎజెండాపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిల్ ప్రజాప్రతినిధులు, కో - ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

వరద తాకిడికి గురై ఇబ్బందులు పడుతున్న పిల్లంక పంచాయతీ కొత్తలంకకు చెందిన 160 కుటుంబాలకు ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో నాయకులు చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, నరసింహారావు, వెంకటేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాస్, డిటి. సూరిబాబు, విఆర్ఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

2న సారె.. చీర..వేడుక..

ప్రజాశక్తి - సామర్లకోట

ఆషాడ మాసం వేడుకల్లో భాగంగా స్థానిక భీమేశ్వర ఆలయంలో బాలా త్రిపుర సుందరికి ఆగస్టు 2న సారే..చీర... వేడుకను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలా త్రిపుర సుందరికి అతి పురాతన దేవాలయమైన మాండవ్య నారాయణ స్వామి ఆలయం నుంచి సారే... చీరలు సమర్పించనున్నట్లు తెలిపారు.

కార్టూ'నిజం'

పలు ప్రాంతాల్లో స్టూడెంట్స్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లోని వివిధ పాఠశాలల్లో సర్వేపల్లి రాధకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. ఆయా కార్య క్రమాల్లోఅధికారులతోపాటు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రౌతులపూడి మండలంలోని ములగపూడి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ స్టూడెంట్స్ కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎన్‌డిఎ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి లక్ష్మణమూర్తి, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, సర్పంచ్ తమరాన సత్యనారాయణ, ఎంఇఒలు అడికర్ల శ్రీను, గాడి కొండబాబు, ఎంపిటిసి సభ్యులు యామల సురేష్, సోమరౌతు రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని రాయభూపాలపట్నంలో ఉన్న రెండు మండల పరిషత్ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లును పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే సత్యవతి పాల్గొని విద్యా ర్థులకు స్టూడెంట్స్ కిట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మన్యం ప్రసన్నకుమార్, కల్లూరి శ్రీను, పెనుమర్తి దొరబాబు, సానిపిని సురేష్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని జి.రాగంపేట గ్రామంలోని మండల పరిషత్తు పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లును పంపిణీ చేశారు. సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవల్ల వరప్రసాద్, జలదాని సుబ్రహ్మణ్యం, దూసర్లపూడి ఏసుబాబు, గాడి బాబురావు, ఎం బుల్లి రాజు, ఉపాధ్యాయులు కెనడీ పాల్గొన్నారు. **పిఠాపురం** మండలానికి చెందిన చిత్రాడలోని మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూటమి నాయకులు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాల, హుస్సేన్‌పురంలో ప్రాథమిక పాఠ శాలల్లో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాల్లో పట్టణ టిడిపి అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, గ్రామ టిడిపి అధ్యక్షుడు చల్లా బుజ్జి, కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్, కూటమి నాయకులు సరోజ, బడుగు శ్రీకాంత్, పిట్టా జానకి రామారావు, మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, హెచ్‌ఎం చెప్పారు. మంగళవారం సామర్లకోట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని యు.మీనామాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రౌతులపూడిలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

నేరాలు ఘోరాలు

పోలీసులు అదుపులో ఆన్లైన్ బెట్టింగ్ ముఠా నిందితులు

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - అమలాపురం

ఆన్ లైన్‌లో బెట్టింగ్ గేమ్ నిర్వహిస్తున్న అయిదుగురు సభ్యుల ముఠాను పోలీసులు మంగళ వారం అదుపులోకి తీసుకున్నారు. మంగళ వారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐ క్రిస్టోఫర్ మాట్లాడారు. తమకు రాబడిన సమాచారం మేరకు పట్టణంలోని ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అంబికా లాడ్జిపై నిర్వహించిన దాడుల్లో బెట్టింగ్ ముఠాను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ దాడిలో నిందితుల వద్ద నుంచి 5 ల్యాప్టాప్‌లు, 75 మొబైల్ ఫోన్లు, 15 సిమ్ కార్డులు, 19 బ్యాంక్ చెక్ బుక్‌లు, 25 ఎటిఎం కార్డులు, వై-ఫై రూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని బట్లపాలెంనకు చెందిన మోటూరి దొరసత్యసూర్యమణికంత, మోటూరి మధుపవన్, కృష్ణా జిల్లా కైకలూరుకు చెందిన భలే ప్రవీణ్‌బాబు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని గునుపూడికి చెందిన పంజా సాయి నరసింహ, గురజాపు సూర్య ప్రభులను అరెస్టు చేశామని, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సిఐ తెలిపారు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 22 మందికి జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో సుమారు 22 మందికి శిక్ష విధిస్తూ కాకినాడ మూడవ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు మంగళవారం తీర్పు వెల్లడించారు. కాకినాడ ట్రాఫిక్ సిఐ వెల్లడించిన వివరాలు ప్రకారం. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 48 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసిన కేసులో వన్ టౌన్ స్టేషన్ పరధిలో 33 మందికి, టూ టౌన్ పరిధిలో 15 మంది వాహనదారులకు మెజిస్ట్రేట్ వి.నరసింహారావు 22 మందికి ఒక్కొక్కరికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, మిగతా 26 మందికి ఒక్కొక్కరికి పది వేల చొప్పున మొత్తం రూ.2.60 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యుత్ షాక్‌కు గురై ఒక మహిళ తీవ్రగాయాలపాలయ్యింది. మంగళవారం పట్టణ పరిధిలోని గణేష్ కాలనీ ప్రాంతానికి చెందిన మల్లవరపు మంగ ఇంటి నిర్మాణంలో గోడను తడుపుతుం డగా ఇంటిపై ఉన్న 11కెవి విద్యుత్ వైర్లు ప్రమాదవశా త్తు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురైయింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తమ్ముడిపై దాడి చేసిన అన్న

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తమ్ముడుపై అన్నయ్య కత్తితో దాడి చేసిన సంఘటన శ్రీరాంపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పిర్ల రామకృష్ణ తన తమ్ముడైన పిర్ల సత్తిబాబుపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. సత్తిబాబును కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఇంటికి పెద్దవాడైన రామకృష్ణకు కాకుండా చిన్నవాడైన సత్తిబాబుకు ముందుగా వివాహం చేయడంతో ఇటీవల ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే అసహనానికి లోనైన రామకృష్ణ తమ్ముడిపై దాడికి దిగినట్లు పోలీసులు తెలిపారు.

వేటగాళ్లపై కేసు నమోదు

ప్రజాశక్తి - గోకవరం

అడవి జంతువులను వేటాడుతున్న ఇద్దరు వ్యక్తులపై అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.నాగరాజు తెలిపారు. గంగవరం మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన పాతర అప్పారావు, పొడియం పొట్టి దొరల సూరంపాలెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో అడవి జంతువులను వేటాడి అలసిపోయి తిరిగి గోకవరం మండలం కొత్తపల్లి గ్రామ శివారు వేప చెట్టు కింద నిద్రిస్తుండగా విఆర్ఓ ఎం.వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదుతో వారిని అదుపులోకి తీసుకుని నాటు తుపాకీ, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని అరట్లకట్ట గ్రామంలో మంగళవారం వలస కూలి విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు..అరట్లకట్ట గ్రామంలో132 కెవి లైను పని నిమిత్తం పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొంతమంది అరట్లకట్టలో విద్యుత్ పనులు చేస్తున్నారు. ఎర్త వైరును ఒక టవర్ నుంచి వేరొక టవర్ లాగుతుండగా అది జారీ సహిదు లేషేక్ (20) షాక్‌కు గురియై అపస్మారక స్థితి లోకి వెళ్లాడు. అతనిని కాకినాడ ప్రభుత్వం ఆసుపత్రి తీసుకుని వెళ్ళగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అక్కడే పని చేస్తున్న మృతిని అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఇసుక తరలింపు ప్రారంభం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఈనెల 8న ప్రారంభమైన ఉచిత ఇసుక తరలింపు జట్టు కూలీలకు నగదు చెల్లించకపోవడంతో ఈనెల 11న నిలిచిపోయింది. అయితే అధికారులు రూ. 245 ఉన్న టన్ను ఇసుక ధర ను రూ. 265 కు పెంచడంతో తిరిగి ఉచిత ఇసుక తరలింపు ప్రారంభమైంది.రూ265 చొప్పున కపిలేశ్వరపురం, తాతపూడి స్టాక్ పాయింట్ల నుంచి రెవెన్యూ ,పోలీస్ అధికారులు, సిబ్బంది అక్రమాలకు తావు లేకుండా పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ పాయింట్ లో నుంచి రోజుకు 32 మంది చొప్పున 64 మంది, తాతపూడి లో 14 మంది కూలీలు పనిచేస్తున్నట్లు చెప్పారు .

సమస్యల వలయంలో వైఎస్ఆర్ కాలనీ

పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణం 22వ వార్డులో ఉన్న వైఎస్ఆర్ కాలనీ సమస్యల వలయంలో సతమతమవుతుంది. మాజీ ఎంఎల్ఎ రాజాఅశోక్‌బాబు ఆధ్వర్యంలో తుని పట్టణ పేద ప్రజలకు 1200 గృహాలు మంజూరు అయ్యాయి. వాటిలో సుమారు 860 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే ఈ కాలనీ ఏర్పడి పదేళ్లు కావస్తున్నా నేటికీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. 2019 లో మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో తుని పట్టణం నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారితోపాటు కొన్ని సిసి రోడ్లు మాత్రమే నిర్మాణం చేశారు. కాలనీలో పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించిన పరిస్థితి లేదు. ఆఖరికి కాలనీ ప్రజలకు అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని కల్పించలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రహదారులన్నీ బురదతో మారిపోయాయి. ఆ రహదారుల్లో వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీ నుంచి విద్యార్థులు స్కూలుకు వెళ్లాలంటే సుమారు కిలోమీటర్ మేర నడిచివెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో విష పురుగులు రోడ్డుపైనే సంచరిస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు. ఇదే మార్గంలో డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక ఉండటంతో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగలు పెరిగిపోవడంతోపాటు, డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఆఖరికి ఈ మార్గంలో వీధి లైట్ల సౌలభ్యం లేకేపోవడంతో చీకటి పడితే ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే బిక్కుబిక్కుమంటూ అడుగులు వేయాల్సిన దుస్థితి నెలకుంది. తాగునీటిని కొనుగోలు చేసుకునేందుకు కిలోమీటర్‌పైనే వెళ్తున్నామని కాలనీవాసులు అప్పలరాజు, సత్తిబాబు, గోవిందు దుర్గారావు, అప్పారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైఎస్ఆర్ కాలనీలో రహదారిలో నిలిచిపోయిన వర్షపు నీరు

వీధిలైట్లు వేయాలి

రాత్రి సమయంలో కాలనీ నుంచి బయటకు వెళ్లాలంటే బిక్కుబిక్కు మంటూ వెళ్తున్నాం. పదేళ్లు అయినా కాల నీకి వెళ్లే మార్గంలో వీధి లైట్లు కూడా వేయలేదు. రాత్రి సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే చీకటిలోనే వెళ్లాల్సివస్తుంది. తక్షణమే కాలనీకి వెళ్లే రహదారిలో వీధిలైట్లు సౌకర్యం కల్పించాలి.

-బి.అప్పలరాజు కాలనీవాసి

సిసి రోడ్డు నిర్మించాలి

కాలనీ వీధుల్లో సరియైన రోడ్డు వేసిన పరిస్థితి లేదు. వర్షాకాలంలో రోడ్లు, డ్రెయిన్లు అన్నా తేడా లేకుండా నీరు నిలిచిపోతుంది. ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి. తక్షణమే సిసి రోడ్డు, డ్రెయినేజీలను నిర్మించాలి.

-ఎస్.గోవిందు, కాలనీవాసి

వార్డు మాజీ సభ్యుని నేత్రాలు దానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని యర్రవరం గ్రామం మాజీ వార్డు సభ్యుడు కీర్తిశేషులు మైరాల చక్రరావు కోరిక మేరకు ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు మైరాల కనకారావు మాట్లాడుతూ తన తండ్రి కోరిక మేరకు నేత్రదానం చేశామన్నారు. చక్రరావు మంగళవారం ఉదయం మరణించడంతో రాజమహేంద్రవరంకు చెందిన రాధాకృష్ణ నేత్రాలయం ప్రతినిధులు ఆయన కార్నియాలను స్వీకరించారు. తండ్రి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న కుమారులు మైరాల కనకారావు, మైరాల నాగేశ్వరరావు నేత్రదానం చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు మైరాల కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి నేత ప్రసాద్ సూచించారు.

పించన్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలవ్యాప్తంగా ఆగస్టు ఒకటో తేదీన పించన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపిడిఒ శ్యాంసుందర్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 6.గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 6 గంటల్లోగా నూరు శాతం పించన్లు పంపిణీ చేస్తామన్నారు. పింఛనుదారులు తమ తమ గృహాల వద్ద ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదాయ పన్నుల శాఖ అధికారులు

ఆదాయ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో మంగళ వారం ఆదాయ పన్నుల శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, చీఫ్ కమిషనర్ శవరీంద్ర మెహతా, ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్ల, ప్రిన్సిపల్ కమిషనర్ (అడ్మిన్) రవి కిరణ్, ప్రిన్సిపల్ కమిషనర్ (టిడిఎస్) శ్వరేష్ సాకా బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారి నీలకంఠం వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

విద్యార్థినిని సన్మానిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ఏలేశ్వరం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గోదావరి టాలెంట్ టెస్ట్‌లో ఏలేశ్వరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని ఎస్.నేహశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం.ఎస్. లక్ష్మీతులసి తెలిపారు. 60 మార్కులకు 57 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. పడాల చారిటబుల్ ట్రస్ట్, తానా ఫౌండేషన్ సహకారంతో తమ పాఠశాలలో చదువుతుందన్నారు. మంగళవారం విద్యార్థిని ఘనంగా సన్మానించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సిహెచ్ నూకరాజు ఇచ్చిన శిక్షణతో ఆమె ఉత్తమ ప్రతిభను చాటుకుందని హెచ్‌ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌ను శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో అభ్యర్థులకు పోలీస్ కోచింగ్‌తోపాటు ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇవ్వడం పట్ల అభినందనలు తెలిపారు. ఎస్‌పిని కలిసిన వారిలో ఫిజికల్ డైరెక్టర్ కాంతారావు ఉన్నారు.

ఎస్‌పికి మొక్కను అందిస్తున్న గుంటూరు శ్యామ్

యానాం వార్తలు

నివాళులర్పిస్తున్న ఆర్ ఎ ఒ మునిస్వామి, ఇతరులు

మద్దింశెట్టి సత్యానందంకు నివాళి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా ప్రజలకు సేవలందించిన మద్దింశెట్టి సత్యానందం జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్‌ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం, ఎస్ఐ మూరుగానందం, కొల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న వారితో ఆర్ఎఒ మునిస్వామి, ఇతర అధికారులు

తాబేళ్ల సంరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి - యానాం

విశాఖపట్నం ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మత్స్యకారులకు తాబేళ్ల తప్పించుకునే పరికరం(టెడ్), వాటి సంరక్షణపై శిక్షణ ఇచ్చారు. గత రెండు రోజులుగా స్థానిక సర్వ శిక్ష అభియాన్ ఫంక్షన్ హాల్‌లో మెరైన్ మత్స్యకారులకు ఇచ్చిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి డి.గొంతెయ్య, ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ స్టేట్ కోఆర్డినేటర్ పి.హనుమంతరావు పాల్గొన్నారు.

పెరవలిలో భారీ అన్నదానం

ప్రజాశక్తి-పెరవలి

పాల్గొన్న యాత్రికులు

మండలంలోని పెర వలి సెంటర్‌లో ఉన్న శ్రీ షిరిడీ సాయి దత్తాత్రేయ మందిరం వద్ద మంగళవారం గురు పౌర్ణమి సం దర్భంగా సుమారు 6000 మందికి దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి చుట్టుపక్కల గ్రామాలు నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, అజ్జరం, కాపవరం గ్రామాల నుంచి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డు రామాంజనేయులు, సలాది సత్య సాయి బాబా, గునిపెళ్ళ నాగు, టి.అర్జున్‌రావు పాల్గొన్నారు.

నీట మునిగిన అరటి తోట

ప్రజాశక్తి-పెరవలి

గోదావరి పరీవాహక లంక ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో అరటి తోట ఇంకా వరద నీటిలోనే ఉంది. కానూరు అగ్రహారం, కాకరపర్రు, ఉసులుమర్రు, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల పరిధిలో లోతట్టు పల్లపు ప్రాంతాల్లో ఉన్న అరటి పూల తోటలు కూరగాయ పంటలు ఇంకా నీట మునిగి ఉన్నాయి.

పించన్ల పంపిణీ మొదటి రోజే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పించన్ల పంపిణీ ప్రక్రి యను మొదటి రోజునే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఎంపిడిఒలను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పించన్ల పంపిణీ సన్నద్ధత అంశాలపై సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని చక్కటి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి ఆగస్టు ఒకటో తేదీనే పెన్షన్లు నూటికి నూరు శాతం పంపిణీ చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా 28 కేటగిరీల్లో 2,43,402 మందికి గాను రూ.101 కోట్ల 30 లక్షల ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల ఇంటింటికి పంపిణీ కి ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పించన్లు ఆగష్టు 2024 నెల పెన్షన్ పంపిణి ప్రక్రియను ఆగస్టు 1 వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ప్రారం భించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే రెండో రోజు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ముందస్తుగా ఆగస్ట్ 1 తేదీ పెన్షన్ పంపిణీపై అన్ని గ్రామాల్లో ప్రచారం,సామాజిక మాధ్యమాల ద్వారా గావించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,258 మంది సిబ్బంది ఇంటింటికి పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. పెన్షన్ పంపిణీ చేసే సిబ్బందికి పెన్షన్ దారులను మ్యాప్ చేశారన్నారు.

చెత్తను డిస్పోజల్‌కు ప్రణాళికలు రూపొం దించాలి

పురపాలక సంఘాలలో డంపింగ్ యార్డులలో చెత్తను ఏ రకంగా డిస్పోజల్ చేయాలనే దానిపై జిల్లా మొత్తం ఒక కార్యాచరణ ప్రణాళికలు రూపొం దించాలని కలెక్టర్ మహేష్ కుమార్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రామ పంచాయతీల అధికారులు, పురపాలక సంఘాల కమిషనర్లు తదితర అధికా రులతో సమావేశం నిర్వహించి 15 ఆర్థిక సంఘం నిధులు అమృత్ 2.0 నిధులు వినియోగం, చెత్త రీసైక్లింగ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పురపాలక సంఘాలలోని అన్ని వార్డులకు తాగునీటిసరఫరా అంశాల పురోగతిపై సమీక్షించారు.

50 శాతం రాయితీపై రాగుల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్ళూరు గ్రామంలో 50 శాతం రాయితీపై రాగులను రైతులకు అందచేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉప సర్పంచ్ పయిన్ని వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు కొంద్రు అప్పలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా రాగులను అందిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఎఎ పృథ్వీ, రైతు రాఘవ పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాలు నిర్మించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

రామేశ్వరం పేట, సూరంపాలెం పరిధిలో ఉన్న కళాశాలలను దృష్టిలో పెట్టుకుని బాల బాలికలకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కె సతీష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానికంగా జరిగిన కమిటీ సమావేశం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ రెండు ప్రాంతాలలో ఆదిత్య యూనివర్సిటీ, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలలో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు కళాశాల సమీప ప్రాంతాలలో అద్దెకు ఉంటున్నారన్నారు. ప్రతి నెల రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకూ అద్దెలు చెల్లిస్తున్నారని అన్నారు. కళాశాలల హాస్టల్స్‌లో అధిక ఫీజులు వసూలు చేయడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఫీజులు చెల్లించలేక అద్దె గదుల్లో ఉంటున్నారన్నారు. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వసతి గృహాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు నాయకులు ధనరాజు, గౌతమ్, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి పుస్తకాలు అందిస్తున్న తాతీలు

పూర్వ విద్యార్థులచే పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కరప

స్థానిక నక్కావారిపేటలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆనంద్ భారతి పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, జనసేన నాయకులు జల్ల శివ కుమార్, పేపకాయల రాజు, హెచ్ఎం వినాద్రి, దేగల లక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఒలింపిక్స్ సెల్ఫీ స్టేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

పారిస్‌లో నిర్వహిస్తున్న ఒలింపిక్స్ క్రీడలపై భారతదేశ ప్రజలకు అవగాహన కొరకు, భారత క్రీడాకారులను అభినందించేందుకు వేదికలను అన్ని సెల్ఫీ స్టేషన్లో ఫ్లెక్సీ బ్యానర్లు స్టాండ్‌లను ఏర్పాటు చేయవలసినదిగా ఎపి క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశించింది. ఈ ఆదేశాల ప్రకారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి ఆధ్వర్యంలో సెల్ఫీ స్టేషన్ కలెక్టరేట్ ప్రాంగణం నందు ఏర్పా టు చేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఎఒ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నద్ధ అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిం చారు ఈ సందర్భంగా ఆయన ఇంతవరకు నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏ విధంగా నిర్వహించారన్న అంశాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో జిల్లా జెసి టి.నిషాంతి, జిల్లా ఎస్‌పి బి.కష్ణారావు డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరు తదితర అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి -మామిడికుదురురూరల్

లూటుకుర్రు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ అడబాల రామ సత్యనారాయణ (తాతకాపు) అన్నారు. లుటుకుర్రులో అడబాల వారి మెరక, బాడి లంక కాలనీ ఏరియాలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షల వ్యయం తో నిర్మించే సిసి రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమం లో పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

కలెక్టరేట్ వద్ద మంగళవారం కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాకు ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణ రావు మద్దతు తెలిపారు. రైతు నాయకులు యాళ్ల బ్రహ్మానందం, రైతు పరిరక్షణ సమితి నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, బిఎస్‌పి నాయకులు పాలమూరు మోహన్, టిడిపి నాయకులు భవనం సత్తిబాబు, రంకిరెడ్డి శ్రీనివాసరావు,ఆకేటి బాబులు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం ప్రిన్సిపల్ టి.గంగాభవాని అధ్యక్షతన జరిగిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఎంఎల్ఎ సుబ్బరాజు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినిలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, అశోక్, గోలకోటి దొర బాబు, దొమ్మేటి రమణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P. No. 35/2024

బిట్వీన్:
1. బండారు జ్యోతి వెంకట సుజాత, W/o. (లేటు) వెంకట దుర్గారావు.
2. బండారు బిందు శ్రీనిజ, వయస్సు 7 సంవత్సరాలు, D/o. (లేటు) వెంకట దుర్గారావు.
3. బండారు విషిత్ వెంకట శ్రీనివాస్, వయస్సు 5 సంవత్సరాలు S/o. (లేటు) వెంకట దుర్గారావు.
డోర్ నెం. 1-8-173, వంశీకృష్ణ కాలనీ, మెట్టుకూరు, యానం.
(పై రెండు, మూడు పిటీషనర్లు మైనర్లు అయినందున గార్డియన్ సంరక్షకురాలు తల్లి బండారు జ్యోతి వెంకట సుజాత)

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిలో పై నెంబరు మైనరు పిటీషనర్లుకు ఒక్కొక్కరికి గల 1/20వ వంతు వాటా అనగా ఇరువురికి కలిపి 1/10వ వంతు అవిభక్త వాటా అమ్ముటకు పర్మిషన్ ఇప్పించమని దాఖలు చేసిన పై నెంబరు పిటీషన్‌లో ఎవరికైనను అభ్యంతరములు ఉన్న యెడల పై శ్రీ కోర్టు వారి ఎదుట **ది. 21-08-2024వ సంవత్సరం తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు** హాజరు అయి అభ్యంతరము తెలియ పరచుకొనవలెను. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

షెడ్యూలు

ప్రస్తుతం కాకినాడ జిల్లా, పూర్వం తూర్పుగోదావరి జిల్లా, తాళ్ళరేవు సబ్‌రిజిస్ట్రారులో చేరిన తాళ్ళరేవు మండలంలో గల నీలపల్లి గ్రామంలో S.No. 120/7, 4వ వార్డులో గల య. 0.05 సెంట్లు అనగా 242 చ॥గ॥ లేదా 203.28 చ॥మీ॥ గల స్థలం అందు గల ఆర్.సి.సి. బిల్డింగ్ (బిల్డింగ్ విస్తీర్ణం 784 చ॥అ॥)కు హద్దులు.
తూర్పు: మట్టా ఏడుకొండలు గారి ఇంటి సరిహద్దు గోడ. **పడమర:** మట్టా వెంకట రమణ మరియు షేక్ నవాబ్ వల్లీ గార్ల స్థలము. **ఉత్తరం:** బండారు సీత గారి ఆస్తి. **దక్షిణం:** సత్రం గోడ.
సదరు హద్దుల మధ్యస్తమైన స్థలము మరియు బిల్డింగ్‌లో పై మైనర్లు ఇరువురికి కలిపి గల 1/10వ వంతు వాటా అనగా 24.2 చ॥గ॥ అవిభక్త వాటా అందు గల యావత్తు ఈజ్‌మెంటు హక్కులు నీటి వనరులు వగైరాలు సహా.

కాకినాడ
29-7-2024
సత్తి గంగాదేవి
పిటిషనర్ తరుపు న్యాయవాది, కాకినాడ

మహారాజశ్రీ కాకినాడ 3వ అ॥ జిల్లా జడ్జి వారి కోర్టు
E.A. 345/2023 in E.P. 2/2015 in O.S. 131/2004

Between:
వెలుగుబంట్ల వెంకటేశ్వరరావు
-పిటీషనరు/ DHr
AND
1) చిల్లా అప్పాయమ్మ, W/o. ముసలయ్య, డో.నెం. 24-8-74/1, నియర్ పాత బస్‌స్టాండు, ఫస్ట్ స్ట్రీట్, కచ్చేరిపేట, కాకినాడ.
2. చిల్లా అరుణకుమారి, D/o. ముసలయ్య, డో.నెం. 24-8-74/1, నియర్ పాత బస్‌స్టాండు, ఫస్ట్ స్ట్రీట్, కచ్చేరిపేట, కాకినాడ.
3. చిల్లా వెంకటలక్ష్మి, D/o. ముసలయ్య, డో.నెం. 24-8-74/1, నియర్ పాత బస్‌స్టాండు, ఫస్ట్ స్ట్రీట్, కచ్చేరిపేట, కాకినాడ.
4. చిల్లా గౌరి రత్నకుమారి (Set exparty)
5. చిల్లా జయవీర, D/o. ముసలయ్య, డో.నెం. 24-8-74/1, నియర్ పాత బస్‌స్టాండు, ఫస్ట్ స్ట్రీట్, కచ్చేరిపేట, కాకినాడ.
-1 to 3 and 5 రెస్పాండెంట్లు/ JDrs

పై నంబరు చెక్కు పిటీషనులో కోర్టు వారి ఆర్డరు ప్రకారం 1 to 3 and 5 రెస్పాండెంట్లుకు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్ పోస్టు ద్వారాను ఎన్నిసార్లు నోటీసులు పంపించినను అందుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు పై పిటీషను **ది. 12-08-2024 సం॥ తేదీన వాయిదా ఉన్నదని** యిందుమూలంగా తెలియజేయడమైనది. సదరు పై 1 to 3 and 5 రెస్పాండెంట్లు సదరు **వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల పై నంబరు పిటీషను మీ పరోక్షమందు తీర్మానించెదరని యిందుమూలంగా తెలియజేయడమైనది.

డి.ఎస్.ఎస్.శంకర్, అడ్వకేట్
గాంధీనగర్, కాకినాడ
సెల్: 9010326816